
క్లుప్తంగా

ఘనంగా బాలయోగి మెట్ట తీర్థం



బాలయోగి మెట్ట వద్ద తీర్థంలో జనం

తుని రూరల్: తుని మండలం జగన్నాథగిరి సమీపంలో బాలయోగి మెట్ట వద్ద తీర్థం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ముక్కనుమ మరుసటి రోజు జరిగే తీర్థాన్ని నిర్వాహకులు గురువారం నిర్వహించారు. జగన్నాథగిరి, ఎస్.అన్నవరం, రాజుపేట, మర్లపాడు, లోవకొత్తూరు, వెలమ కొత్తూరు, తాళ్లూరు, తుని పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొండపై బాలయోగి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఉత్సాహంగా తీర్థంలో పాల్గొన్నారు. రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సర్పంచ్‌కు సన్మానం

ఏలేశ్వరం: తూర్పులక్ష్మీపురం సర్పంచ్ వీరంరెడ్డి నాగభార్గవి ఇటీవల బీడీఎస్ పట్టా పొందడంతో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మరిన్ని ఉన్నత చదువులు చదువుతూ ప్రజలకు సేవ చేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి



మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న కేంద్ర మంత్రి మంజు పార

శంఖవరం: ప్రధాని మోదీ పాలనలో దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ఆయుష్, మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి మహేంద్ర మంజు పార అన్నారు. కత్తిపూడిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలకు ఉచితంగా గ్యాస్ స్టౌ, సిలిండర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కోసం పని చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ప్రతి పేదవాని ఇంట్లో వెలుగు నింపాలనే ఉద్దేశంతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గంటా బాలుదొర, నాయకులు ఆదద్రా వెంకన్నదొర, తుమ్మల పద్మజ, మట్టా మంగరాజు, దేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం

గోకవరం: తాకూరుపాలెం గ్రామంలోని సింహాద్రివారి చెరువులో గురువారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై కె.నాగరాజు కథనం ప్రకారం .. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన కట్టా రాంబాబు (30) ఈ నెల 13న పౌల్ట్రీ మేత దింపే పని నిమిత్తం లారీపై గోకవరం వచ్చాడు. గోకవరంలో లారీ ఆగిపోవడంతో అప్పటి నుంచి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం ఎంత గాలించినా లభ్యం కాలేదు. ఈ క్రమంలో గురువారం అతని మృతదేహం తాకూరుపాలెం శివారున ఉన్న సింహాద్రివారి చెరువులో తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరానికి తరలించారు. ఈ సంఘటనపై అతని తండ్రి బోరయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

తొండంగి: పెరుమాళ్లపురం పంచాయతీ ఆవుల మంద గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొయ్యా కోటబాబు తల్లి నాగమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు గురువారం పార్టీ నాయకులతో కలసి పరామర్శించారు. కోటబాబు, సోదరులు నాగేశ్వరరావు, లోవరాజు తదితర కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు అంబుజాలపు సత్యనారాయణ, కొండబాబు తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

ఏలేశ్వరం/ రౌతులపూడి: స్థానిక లింగవరం కాలనీ వద్ద టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పైల సత్యనారాయణ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రౌతులపూడి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు తమరాన సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పూలమాలలు వేశారు.

మహిళాన్వితం

- లాభాల్లో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్
- ఏడాదిలో రూ.5.63 లక్షల నికర లాభం
- 21,300 మందికి ఆర్థిక ప్రయోజనం



ఎ.కొత్తపల్లిలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్

తొండంగి: అతివలు అన్నింటా రాణిస్తున్నారు.. ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో మరింత ప్రగతి సాధిస్తున్నారు.. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు షేర్ హోల్డర్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ఏడాదిలోనే లాభాల బాటలో పయనిస్తోంది. ఎ.కొత్తపల్లిలో ఏర్పాటైన ఈ మహిళా మార్ట్‌తో పలువురికి ఉపాధి లభించడంతోపాటు షేర్ హోల్డర్లకు లాభాలు తెచ్చిపెడుతోంది. జిల్లాలో తొలుత యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో మార్ట్ ప్రారంభించగా, రెండోది తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో కావడం విశేషం. దీనికి ప్రస్తుతం వినియోగదారుల నుంచి ఆదరణ లభించడంతో లాభాల బాటలో సాగుతోంది.

రూ.42 లక్షల పెట్టుబడితో ఏర్పాటు

తొండంగి మండలంలో 22 పంచాయతీల పరిధిలో 53 గ్రామాలు ఉన్నాయి. వైఎస్సార్ క్రాంతి పథంలో 72 గ్రామ సంఘాలు ఉండగా 2,369 డ్వాక్రా సంఘాలు కొనసాగుతున్నాయి. వాటిలో మొత్తం 25,023 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు, చేతివృత్తుల ద్వారా ఉత్పత్తులతో పాటు ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులను విక్రయించేందుకు వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లకు ప్రణాళిక చేసింది. దీనికోసం మండల స్థాయిలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులను ఆర్థిక భాగస్వాములను చేస్తూ వైఎస్సార్ చేయూత మార్ట్‌లు ఏర్పాటు చేసింది. ఒక్కో సభ్యురాలు రూ.200 చొప్పున షేర్ హోల్డర్‌గా నిర్ణయించింది. దీనిపై గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడంతో మండలంలోని 72 గ్రామ సంఘాల్లోనూ 2,130 మహిళా సమాఖ్య సంఘాలకు చెందిన 21,300 మంది రూ.42.60 లక్షల పెట్టుబడి పెట్టారు. ఈ నిధులతో ఎ.కొత్తపల్లిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను 2022 డిసెంబర్ 27న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత ప్రారంభించారు. 2023 డిసెంబర్ నాటికి ఏడాది పూర్తవడంతో మండల మహిళా సమాఖ్య, వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు కలసి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వినియోగదారులకు లక్కీ డ్రా తీసి బహుమతులు అందజేశారు. ఏడాదిలో మార్ట్ ద్వారా వార్షిక టర్నోవర్‌గా రూ.2.10 కోట్లు చేయగా సరకుల కొనుగోలు పెట్టుబడి, సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చులు పోగా రూ.5.63 లక్షల నికర లాభం వచ్చిందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వై.సత్తిబాబు తెలిపారు. వచ్చిన లాభం షేర్ హోల్డర్లుగా ఉన్న డ్వాక్రా మహిళలకు సమానంగా అందిస్తామన్నారు. టర్నోవర్ పెరిగితే మరిన్ని లభాలు పెట్టుబడి పెట్టిన డ్వాక్రా మహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రజలు మల్టీనేషన్ కంపెనీల మార్ట్‌లకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలో నాణ్యమైన సరకులను అందించే విలేజ్ వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను మరింత ఆదరించాలని డ్వాక్రా సంఘాల మహిళలు కోరారు.



ఎ.కొత్తపల్లి మహిళా మార్ట్ వార్షికోత్సవంలో డ్వాక్రా మండల సమాఖ్య సభ్యులు, మార్ట్ సిబ్బంది

తక్కువ ధరకే నిత్యావసరాలు



ప్రభుత్వం వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేసింది. ప్రజలకు అవసరమైన నిత్యావసరాలను మార్కెట్ ధరల కన్నా తక్కువకు విక్రయిస్తుంది. ఇక్కడ సరాసరిన నెలకు రూ.20 లక్షల వరకూ టర్నోవర్‌తో ఏడాదిలో రూ.2 కోట్లకు పైగా టర్నోవర్ జరిగింది. డ్వాక్రా మహిళలకు వార్షిక లాభంలో ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.

– వై.సత్తిబాబు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, తొండంగి మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



మార్ట్ ద్వారా రూ.5 లక్షలకు పైగా వార్షిక లాభం వచ్చింది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది మహిళా మార్ట్‌లో విక్రయాలు సాడిస్తే డ్వాక్రా మహిళలందరికీ ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. తద్వారా సమష్టిగా అభివృద్ధి చేసుకుంటాం. మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి ఈ మార్ట్ ఏర్పాటు చేయించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– అడ్డాల సూర్యకాంతం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, తొండంగి

మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ తదితరులు

కిర్లంపూడి: దళితుల మనోభావాలు దెబ్బతీసేలా రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి గునిపే భరత్ మాట్లాడడం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ అన్నారు. గోకవరంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం రాష్ట్ర చరిత్రలోనే సువర్ణ అధ్యాయం అన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుపై దళితుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం బాధాకరమన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పసుపు, కుంకుమల పేరుతో దారి మళ్లించిన ఘనత అప్పటి సీఎం చంద్రబాబుదేనని అన్నారు. కారంచేడు వివాదాల్లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితులను ఊచకోత కోసి గోనె సంచిలో మూటగట్టి పడేసిన సంఘటనలు గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బిజ్జిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ, అంబటి ప్రసన్న, మచ్చా మోహన్, మచ్చా జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కులగణన సర్వే

కోటనందూరు: మండలంలో కులగణన సర్వే శుక్రవారం నుంచి నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఆర్థిక ప్రణాళిక కోసం ఈ సర్వే జరుగుతుందన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయం

- జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం
- ఎమ్మెల్సీ అనంతబాబు, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సుబ్బారావు



నాయకులతో ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, మళ్లీ జగనన్నే సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు), పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో అనంతబాబు, సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి పాటుపడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు చేకూరిందన్నారు. ఎస్సీ సెల్ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ గొల్లా ఏడుకొండలు, ఎంపీపీ గోళ్ల క్రాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, నాయకులు కొప్పన సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు సాధనాల అప్పారావు, ఉమ్మిడి తాతీలు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, జువ్వల బాబులు, పినిశెట్టి ప్రకాష్, గొనగాల అప్పలరాజు, శిగడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినికిడి సమస్య లేని జిల్లాగా కాకినాడ

- పరిపూర్ణానంద సరస్వతి
- పలు సంస్థలు అందించిన వినికిడి యంత్రాల పంపిణీ

బోట్‌క్లబ్: జిల్లాను వినికిడి సమస్యలేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆ సంస్థల ఆధ్వర్యంలో గురువారం వినికిడి సమస్యలతో బాధపడుతున్న 150 మంది పేదలకు రూ.30 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ తోట సర్వారాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు 250 మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు మాట్లాడుతూ ఇప్పటి వరకు 10 వేల వినికిడి యంత్రాలను ఉచితంగా, ఐదు వేల యంత్రాలను 50 శాతం ధరలకు అందించినట్టు తెలిపారు. కాకినాడ ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి వినికిడి సమస్య లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు చెక్కా రమేష్, అనపర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న పరిపూర్ణానంద సరస్వతి

21 నుంచి శ్రీరామ కల్యాణ పట్టాభిషేకోత్సవాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అభిషేక కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగాలన్న సత్సంకల్పంతో 21, 22 తేదీలలో కాకినాడ ఆనంద భారతి మైదానంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వేద పండితుడు ఎ.మురళీకృష్ణ గురువారం విలేకర్లకు తెలిపారు. కాకినాడ శ్రీరామ భక్త సమాజం, హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష కార్యక్రమాల్లో ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. 21న ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన, 8 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర జపం, మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీరామ తారక నామ మహా మంత్ర హవనము, సాయంత్రం నాలుగు గంటల నుంచి సకల వాహిని బృందంచే ప్రత్యేక కీర్తనలతో భజన, సాయంత్రం ఐదు గంటలకు శ్రీ సీతారామచంద్రమూర్తి స్వామి వారి దివ్య కళ్యాణం చతుర్వేద స్వస్తి జరుగుతుందన్నారు. అయోధ్య నుంచి వచ్చిన మంత్రాక్షతలను భక్తులకు అందజేయనున్నట్టు వారు వివరించారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర జపం జరుగుతుందన్నారు.

రెండు బైక్‌ల ఢీ

ప్రత్తిపాడు: ధర్మవరంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇరువురు గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వెల్దుర్తి గ్రామానికి చెందిన యు.బూరయ్య, ధర్మవరానికి చెందిన కె.శ్రీనులు కోల్డ్ స్టోరేజీ వద్ద ఎన్‌హెచ్‌పై రోడ్డును దాటుతుండగా వారి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గాయపడిన బూరయ్య, శ్రీనులను ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ విజయవంతం చేయాలి



లింగంపర్తిలో నాయకులతో నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: విజయవాడలో శుక్రవారం నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు కోరారు. గురువారం లింగంపర్తిలో ఆయన ఇంటి వద్ద మహాశిల్పం ఆవిష్కరణకు నియోజకవర్గం నుంచి తరలివెళ్లడంపై ఎస్సీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చేపట్టిన మహాశిల్పం ఆవిష్కరణ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నియోజకవర్గం నుంచి బయలుదేరే వాహనాలను యర్రవరం నుంచి ప్రారంభిస్తామన్నారు. వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. పార్టీ నేతలు ఎంపీపీ గోళ్ల క్రాంతిసుధాకర్, వరుపుల సూరిబాబు, గుడాల రామకృష్ణ, దడాల సతీష్, ఎడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

తుని రూరల్: గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రణాళిక రూపకల్పన, కులగణనపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులకు అవగాహన, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన అవసరాలతో పాటు దీర్ఘకాలిక సదుపాయాల కల్పనకు సర్పంచుల ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 19 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కుల గణనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు. ఎంపీడీఓ పి.రవికుమార్, ఈఓపీఆర్డీ జయరామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధికి పారదర్శకంగా ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఫంక్షనల్ కమిటీల ఏర్పాటుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సామాజిక వర్గాల సమతుల్యతను పాటిస్తూ ఫంక్షనల్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయ పరిపాలనాధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీల్లో సహజ వనరుల, మౌలిక సదుపాయాల, మానవ వనరుల కమిటీలు, విద్యా ఆరోగ్య సంక్షేమ కమిటీ, మైనార్టీ, వయో వృద్ధుల సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలు ఏర్పాటైన తర్వాత ఒక అంశంపై అభివృద్ధి ప్రణాళిలను రూపొందించాలన్నారు. ఈఓపీఆర్డీ కె.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

సెబ్ దాడులు: ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం .. ఇ.గోకవరం అటవీ ప్రాంతాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించి, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, తుట్టా సత్యనారాయణపై పరారీ కేసు నమోదు చేశారు. ఒమ్మంగిలో కుక్కల గన్నమ్మను అదుపులోకి తీసుకుని, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరంలో ముద్దా నూకరాజు నుంచి 35 మద్యం సీసాలు, వెంకటనగరంలో కూసు మంచి నానాజీ నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈ దాడిలో జిల్లా సెబ్ టాస్క్‌ఫోర్స్ వింగ్ సీఐ బి.వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న సారా, మద్యంతో సెబ్ సీఐ అశోక్ తదితరులు

మద్యం విక్రేతల అరెస్ట్

జగ్గంపేట: మామిడాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వేగి ఏసుబాబును అరెస్ట్ చేసి, 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

తుని: స్థానిక వీరవరపుపేటకు చెందిన కిల్లాడ రాంబాబు పరదేశమ్మగుడి ప్రాంతం రామకృష్ణాకాలనీలో సారా అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని సీఐ గీతారామకృష్ణ అన్నారు. నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండు విధించిందన్నారు.



యర్రవరం హైవే జంక్షన్‌లో కానరాని హెచ్చరిక బోర్డులు



చిన్నింపేట వద్ద ప్రమాదాలు జరుగుతున్న హైవే జంక్షన్

జంక్షన్.. టెన్షన్

- ప్రమాదాలకు కేంద్రంగా హైవేలు
- హెచ్చరిక బోర్డులు లేక ఇబ్బందులు

ఏలేశ్వరం: రయ్ రయ్‌మంటూ సాగిపోయే వాహనాలు.. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారులపై ప్రయాణం దినదిన గండంలా మారింది. ఇక వీటిపై జంక్షన్ల వద్ద మరింత ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఈ జంక్షన్లు ప్రమాదాలకు నిలయమయ్యాయి. ఇటీవల కాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. హైవే అధికారులు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టకపోవడంతో ఇంటి నుంచి బయలుదేరే వారు గమ్యం చేరేలోపే మృత్యుఒడిలోకి చేరుతున్నారు. ఇలా ప్రత్తిపాడు నియోజకవర్గంలో పలు జాతీయ రహదారి జంక్షన్లు మృత్యుకుహరాలుగా మారారు. ఏలేశ్వరం మండలం యర్రవరం, చిన్నింపేట, ప్రత్తిపాడు గ్రామంలోని వెల్లేదారి, వచ్చేదారి, రాచపల్లి అడ్డురోడ్డు, శంఖవరం మండలం కత్తిపూడి, అన్నవరంలలో జాతీయ రహదారులపై జంక్షన్లు ఉన్నాయి. ఆయా చోట్ల హైవే అధికారులు ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ రోడ్డు దాటే సమయంలో అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామాలకు వెళ్లే ఈ మార్గాల్లో వాహనాల వేగానికి కళ్లెం వేయకపోవడంతో వస్తున్న ఇబ్బంది ఇది. పలు ప్రమాదాల్లో అనేక మంది క్షతగాత్రులు అవుతుండగా, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా చిన్నింపేట, కత్తిపూడి గ్రామాల జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

అయినా పట్టించుకోక..

హైవే రహదారుల జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వాటి నివారణకు హైవే భద్రతా అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఇటీవల కత్తిపూడి జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువయ్యాయి. వాహనదారులూ నిబంధనలు పాటించకపోవడంతో ప్రాణాలనే కోల్పోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



చిన్నింపేట జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అటుగా వెళ్లాలంటేనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్కడ కనీస చర్యలు తీసుకుని ప్రమాదాలు అరికట్టాలి.

– పి.వినయ్, సిరిపురం

అధికారులు స్పందించాలి



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అధికారులు స్పందించాలి. ఇప్పటికే అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– రామిశెట్టి వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు, యర్రవరం

సాగర తీరం.. ఉల్లాసభరితం



ఉప్పాడ సముద్ర తీరంలో పర్యాటకుల సందడి

కొత్తపల్లి: చల్ల చల్లని గాలులు.. ఎగసి పడే కెరటాల నడుమ ఉప్పాడ సముద్ర తీరం సందర్శకులతో కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సందడి చేశారు. సముద్ర స్నానాలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీర ప్రాంతం సందర్శకులతో కళకళలాడింది. భారీ సంఖ్యలో వాహనాలు రావడంతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది.